84.28 శాతం పోలింగ్

- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- అత్యధికంగా భువనగిరిలో 92.88 శాతం
- అత్యల్పంగా కొత్తగూడెంలో 71.79
- మూడు పంచాయతీల్లో సమాన ఓట్లు
- లాటరీ ద్వారా ఫలితాన్ని తేల్చిన అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా189 మండలాల్లోని 3,834 పంచాయతీల్లో గురువారం జరిగిన మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 84.28 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.88 శాతం, ఆ తర్వాత మూడు జిల్లాలో 90 శాతానికిపైగా పోలింగ్ జరిగింది. నల్లగొండలో 90.53, సూర్యాపేటలో 90.18, ఖమ్మంలో 90.16 శాతం పోలింగ్ నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యల్పంగా భద్రాది కొత్తగూడెం జిల్లాలో 71.79 శాతం, ఆ తర్వాత అదిలాబాద్‌లో 75.25, జగిత్యాలలో 77.68, ములుగులో 78.65 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు కొంత మందకొడిగా సాగింది. మొదటి రెండు గంటల్లో 21.07 పోలింగ్ నమోదు కాగా, అ తర్వాత 9 నుంచి 11 గంటల వరకు 53.04 శాతం ఓటింగ్ నమోదైంది. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చివరి రెండు గంటల్లో 30 శాతానికి పైగా ఓటింగ్ నమోదు కావడంలో మొత్తం 84.28 శాతానికి చేరుకుంది. ఏకగ్రీవం, నామినేషన్ దాఖలు కాని గ్రామాలను మినహాయిస్తే మొత్తం 53,57,277 మంది ఓటర్లకు గాను 45,151,41 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 21,99,267 మంది పురుషులు (84.16 శాతం), 23,157,96 మంది మహిళలు (84.40 శాతం), 78 మంది ఇతరలు (41.27 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికలసంఘం తెలిపింది. .

మూడు స్థానాల్లో లాటరీ ద్వారా ఫలితాలు

మూడు పంచాయతీ స్థానాల్లో ఇరువురు అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో అధికారులు లాటరీ ద్వారా విజేతను ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా లక్ష్మక్కపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులకు 148 ఓట్లు వచ్చాయి. దాంతో, విజేతను తేల్చడం కోసం అధికారులు లాటరీ తీశారు. లాటరీలో బీఆర్ఎస్ అభ్యర్థి ఇండ్ల రాజయ్య సర్పంచ్‌గా ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం చిన్న ఎల్క చెర్లలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు 212 ఓట్లు వచ్చాయి. రీకౌంటింగ్‌లోనూ ఇద్దరికీ సమాన ఓట్లు రావడంతో అధికారులు.. టాస్ వేశారు. అందులో కాంగ్రెస్ అభ్యర్థి మరాఠి రాజ్‌కుమార్‌ను అదృష్టం వరించింది. ఇక రేగోడ్ మండలం కొండాపూర్‌లో ఒక్క ఓటు తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి బేగరి పాండరి గెలుపొందారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సూరం పల్లిలోనూ లాటరీ తప్పలేదు. కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులకు సమానంగా 276 ఓట్లు వచ్చాయి. లాటరీ తీయగా బీఆర్ఎస్ బలపర్చిన మైలారం పోచయ్య సర్పంచ్ అయ్యారు.

ఓయూలో రేవంత్ ప్రసంగం విషపూరితం

- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం విషపూరితమని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. మూడు రూపాయల మైండ్‌సెట్‌తో మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ రాదని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... నల్లమల అడవులతో సిఎంకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆయన పుట్టిన కొండారెడ్డిపల్లి నుంచి నల్లమలకు గంటన్నర ప్రయాణమని వివరించారు. తెలంగాణ ఉద్యమంపై తుపాకి ఎక్కుపెట్టిన రేవంత్ ఓయూలో ఉద్యమం గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ ద్రోహుల వల్లే యాదయ్య, వేణుగోపాల్‌రెడ్డి లాంటి అమరులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఫ్యూడల్ మనస్తత్వం ఉన్నవారనీ, అందుకే కెసిఆర్ స్థాపించిన గురుకులాలను ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. 2.5 లక్షల మందికి నాణ్యత విద్య ఇస్తూ మిగతా 15 లక్షల మందిని విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లపై బిసిల గొంతు కోసి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం డ్రామా అని అన్నారు. అది తెలంగాణ రైజింగ్ కాదనీ, రావేజింగ్ అని చెప్పారు.

గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి రెండో రోజూ భారీగా సందర్శకులు

హైదరాబాద్ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ స్టాళ్లు, కార్పొరేట్ కంపెనీల స్టాల్లను గురువారం భారీగా సాధారణ ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులు సందర్శించారు. ఉదయం నుంచే ఈ స్టాళ్లను దర్శించడానికి బారులు తీరారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమాలు 'డిస్కవర్ తెలంగాణ, కల్చరల్ హెరిటేజ్ అండ్ నెక్స్ట్-జెన్ టూరిజం' అనే సదస్సుతో ప్రారంభమైంది. వివిధ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు వందలాదిగా ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణ చరిత్ర, మ్యూజియం సంస్కృతి, పర్యాటక అభివృద్ధి, ఆహార సంస్కృతి తదితర విభిన్న కోణాల్లో విలువైన విశ్లేషణలను ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు వివరించారు. తెలంగాణను ప్రపంచ స్థాయిలో ఒక సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలను వీరు వివరించారు. ఈ సదస్సులో డా.మామిడి హరికృష్ణ, బిరద్ రాజారామ్, పి.పద్మావతి, గోపీ బైల్లుప్పాల పాల్గొని మాట్లాడారు. అనంతరం తెలంగాణ రైజింగ్ - ఎంపవరింగ్ ఆల్, గ్రోవింగ్ టుగెదర్ అనే సదస్సులో ప్రముఖులు విద్యార్థులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా చేపట్టిన ప్రగతిని తెలంగాణ సంస్కృతిని సాంప్రదాయాలపై క్లుప్తంగా వివరించారు ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పెస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి, చేర్యాల పెయింటింగులు, సైబర్ క్రైమ్ చేదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు, డ్రోన్లు, రోబో తదితర 27కు పైగా స్టాళ్లను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, రేపు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ గ్లోబల్ సదస్సును సందర్శించవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

విత్తన బిల్లును తిరస్కరిస్తున్నాం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న విత్తన బిల్లును వెంటనే ఆపాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విత్తన బిల్లు ప్రతిపాదనను తిరస్కరిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న విత్తన బిల్లు ముసాయిదాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న ఈ విత్తన బిల్లు వల్ల రైతన్నలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ట్రయల్స్ లేకుండానే విదేశీ విత్తనాలు దేశంలోకి వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతే కేంద్రంగా, రైతు ప్రయోజనాలే పునాదిగా నూతన విత్తన బిల్లు ఉండాలని సూచించారు. విత్తనాల అంశంలో రాష్ట్రాల పాత్ర లేకుండా చేస్తున్న ఈ బిల్లును అందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతు సంఘాలతోపాటు విత్తన నిపుణులు, వ్యవసాయ రంగ నిపుణులు, రాజకీయ పార్టీలతో కూలంకషమైన చర్చ తర్వాతే ఈ బిల్లుపై ముందుకు పోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ బిల్లులో నకిలీ విత్తనాలను కట్టడి చేసే అంశంపై స్పష్టత లేదనీ, వాటి వల్ల నష్టపోయిన రైతన్నలకు నిర్దిష్ట సమయంలోనే నష్టపరిహారం అందించే అంశంపై గ్యారంటీ లేదని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా విత్తనాల ధరలను నిర్ణయించే విధంగా ఈ బిల్లులో నిబంధనలున్నాయనీ, గతంలా విత్తనాల ధరల నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకుండా పోతుందని వివరించారు. నకిలీ విత్తనాల తయారీలో కంపెనీలను బాధ్యులను చేయకుండా, కేవలం అమ్మకందారులను బాధ్యత వహించేలా చేయడం సరైంది కాదని తెలిపారు. నకిలీ విత్తనాలకు సంబంధించిన అంశంలో జాతీయ స్థాయిలో ఆయా కంపెనీలను బ్లాక్‌లిస్ట్ చేయడం, భారీ జరిమానాలు విధించడం, కఠిన జైలు శిక్ష వంటి అంశాలకు ఇందులో పెద్దగా ఆస్కారం లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కంపెనీల ప్రయోజనాల కోసం కాకుండా రైతన్నల ప్రయోజనాలకు, వ్యవసాయ సంక్షేమ అభివృద్ధికి ఉపయోగపడేలా అత్యంత పారదర్శకంగా, కఠినమైన నిబంధనలతో కూడిన విత్తన బిల్లును తేవాలని డిమాండ్ చేశారు.

మంత్రి కొండా సురేఖపై నాన్ బెయిలబుల్ వారెంట్

- నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో నాంపల్లి కోర్టు మంత్రి కొండా సురేఖపై నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బిడబ్ల్యు)ను జారీ చేసింది. కొండా సురేఖకు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గురువారం ఈ కేసు విచారణకు వచ్చింది. నిందితురాలి గైర్హాజరును న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కోర్టుకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆమెను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరచాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. కెటిఆర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసు (సిసి నెంబర్ 307 ఆఫ్ 2025) విచారణ దశకు చేరుకుంది. గురువారం ఆమె గైర్హాజరుకు సంబంధించి న్యాయస్థానానికి ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం, మినహాయింపు కోరుతూ పిటిషన్ దాఖలు చేయకపోవడాన్ని కోర్టు తప్పుబట్టింది. కోర్టు ప్రొసీడింగ్స్‌కు సహకరించకుండా నిరంతరం గైర్హాజరవుతున్న తీరును సీరియస్‌గా తీసుకున్న న్యాయమూర్తి, ఆమెపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. దీంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. సాధారణ వారెంట్‌లా ఇందులో బెయిల్ పొందే హక్కు నిందితులకు ఉండదు. ఈ వారెంట్ అమలు చేసి నిందితురాలిని హాజరుపరిచే బాధ్యతను పోలీసులకు కోర్టు అప్పగించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి ఐదో తేదీకి వాయిదా వేసింది. తాజా పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పూర్తిగా అవాస్తవం : కొండా సురేఖ

కొన్ని పత్రికలు, మీడియా ఛానెళ్లు, వెబ్‌సైట్లలో న్యాయస్థానం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్టు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని మంత్రి కొండా సురేఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి విచారణ వచ్చే ఏడాది ఫిబ్రవరి ఐదో తేదీన కోర్టుకు హాజరుకావాలంటూ న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అందరూ పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయంలో ఉద్యోగుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించినట్టు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనేక సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వెల్డర్లు బ్లాక్ స్మిత్ పోస్టులను 12 ఏళ్ల నుంచి భర్తీ చేయడం లేదని తెలిపారు. ఫైర్ మాన్ సీనియర్ ఎలక్ట్రీషియన్ పోస్టులను నాలుగేళ్ల నుంచి భర్తీ చేయడం లేదని, కార్పెంటర్ పోస్టులు ఏడేళ్ల నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఉన్నప్పటికీ మెడికల్ బిల్లులు రీయింబర్స్‌మెంట్ ఇవ్వటానికి ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరెండర్ షిప్‌లో రెండు సంవత్సరాల నుంచి 30 మందికి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉద్యోగులకు కనీసం ఇవ్వాల్సిన సబ్బులు, డ్రెస్సులు, బ్రెడ్‌లు పదేళ్ల నుంచి ఇవ్వడం లేదని ఆరోపించారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు జిపిఎఫ్ డబ్బులు ఐదేళ్ల నుంచి అందించడం లేదని కార్మికులు చెబుతున్నారని గుర్తు చేశారు. 2004 తర్వాత చేరిన ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.దశరథ్, ప్రింటింగ్ ప్రెస్ యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ ఆర్.ఈశ్వరయ్య, జనరల్ సెక్రెటరీ ఎం.శ్రీరామ్ సిఐటియు నాయకులు శ్రీనివాస్, ట్రెజరర్ వాసు, తదితర నాయకులు పాల్గొన్నారు.

చనిపోయిన వ్యక్తి సర్పంచ్‌గా గెలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురువారం జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో రాజన్నసిరిసిల్ల జిల్లాలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన చెర్ల మురళి (50) రెండురోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. అయితే గురువారం నిర్వహించిన పోలింగ్‌లో ఆయనకు మొత్తం 700లకుపైగా ఓట్లు సాధించి, 378 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. అయితే ఆయన మరణంతో ఆ గ్రామంలో మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫలితాలు లెక్కించిన అధికారులు చనిపోయిన మురళి విజయం సాధించినట్టు తేలడంతో ఆ ఎన్నికల ఫలితాలు నిలిపివేశారు. ఆ కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

కాంగ్రెస్ మద్దతుదారుల విజయం

- ప్రజల విశ్వాసానికి నిదర్శనం
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘనవిజయం సాధించటంపై టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలవటం, తమ ప్రభుత్వం పట్ల విశ్వాసానికి నిదర్శనమని ఆయన గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని తెలిపారు. "సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి నినాదానికి ప్రజలు పట్టం కట్టారనీ,.. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయం దీనికి ప్రతీక," అని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలపటం, గ్రామ పాలనా వ్యవస్థలో నూతన దిశకు సంకేతమని ఆయన వ్యాఖ్యానించారు.

రాష్ట్రపతి పర్యటన ఖరారు

- శీతాకాల విడిదిలో భాగంగా 17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. ఐదు రోజుల రాష్ట్ర పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం హైదరాబాద్‌లోని బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీసు శాఖ భద్రతా, ట్రాఫిక్, ప్రణాళికను రూపొందించాలని, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యారోగ్య, రోడ్డు భవనాలు, జిహెచ్‌ఎంసి, విద్యుత్ తదితర అన్ని ప్రభుత్వ విభాగాలు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలు స్నేక్ క్యాచర్ బృందాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిహెచ్‌ఎంసి సమన్వయంతో రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో కోతులు, తేనెటీగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో డిజిపి శివధర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ.ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి ఈ. శ్రీధర్, అదనపు డిజిపి మహేష్ భగవత్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ మార్చాలి

- తెలంగాణ పౌర స్పందన వేదిక

హైదరాబాద్ బ్యూరో : పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని తెలంగాణ పౌర స్పందన వేదిక కోరింది. ఈ మేరకు వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రాధేశ్యాం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 9న ఎస్-ఎస్‌సి బోర్డు ప్రకటించిన పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌లో ఒక పరీక్ష తర్వాత మరొక పరీక్షకు మధ్యలో 3 నుంచి 4 రోజుల గడువు ఉందని తెలిపారు. ఇలా పరీక్షల మధ్య ఎక్కువ రోజుల గడువు పెట్టడం మంచిది కాదని వారు పేర్కొన్నారు. ఎక్కువ రోజుల విరామంతో విద్యార్థులు పరీక్షల జిజ్ఞాస నుంచి వైదొలుగుతారని చెప్పారు. అందుకే రోజు విడిచి రోజు పరీక్షలను నిర్వహించేలా మార్పు చేసి సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేయాలని వారు కోరారు.

జోరుగా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ వానాకాలం రికార్డు స్థాయిలో పండించిన ధాన్యంలో 80 లక్షల మెట్రిక్ టన్నులు సివిల్ సప్లయిస్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 8433 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. డిసెంబర్ 10 నాటికి 51.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఆ ధాన్యం విలువ మొత్తం రూ.13661 కోట్లు. ఇందులో 26.37 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం, 25.49 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం ఉన్నది. గత వానాకాలం తరహాలోనే ఈసారి కూడా సన్నాల ఉత్పత్తి పెరిగింది. సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాలుకు రూ. 500 అదనపు బోనస్ చెల్లిస్తుండటంతో సన్నరకాల సాగుకు రైతులు మొగ్గు చూపారు. ఇప్పటి వరకు రూ.314 కోట్లు ప్రభుత్వం సన్నాలకు బోనస్‌గా చెల్లించింది.

మొక్కజొన్న రైతులకు శుభవార్త

మొక్కజొన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ కానున్న రూ. 588 కోట్లు వేయనుంది. గురువారం ఈమేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 2.45 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరణ పూర్తి చేసినట్టు తెలిపారు. 55,904 మంది రైతులకు లబ్ధిచేకూరనుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేనప్పటికీ, రాష్ట్రంలోని మొక్కజొన్న రైతులు నష్టపోకుండా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వమే పంట సేకరణ చేపట్టిందని మంత్రి తెలిపారు.

అంతర్జాతీయ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్

- కర్టెన్ రైజర్ ఆవిష్కరణ
- పర్యాటక భవన్‌లో బెలూన్ ఎగురవేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఫిలిం అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ (హెచ్‌ఐఎస్‌ఎఫ్) సమీపిస్తున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ ఫెస్టివల్ కర్టెన్ రైజర్‌ను బుధవారం టూరిజం ప్లాజాలో టూరిజం ఎండీ వల్లూరు క్రాంతి, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక కలసి సంయుక్తంగా ఆవిష్కరించారు. టూరిజం భవనంపై ప్రచార బెలూన్లను ఎగురవేశారు. ఏడువందలకు పైగా వివిధ దేశాల నుంచి వచ్చిన సినిమాల ప్రోమోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ... ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రపంచ వేదికగా హైదరాబాద్ ఎదిగిందన్నారు. యూరప్ , అమెరికా వంటి దేశాల నుంచి సినిమాలు వచ్చాయని చెప్పారు. భారతదేశంతో పాటు వివిధ దేశాల నుంచి 700 కి పైగా చిత్రాలు రావడం హర్షించదగిన విషయమని అన్నారు. నూతనంగా ఫిలిం ఇండస్ట్రీలోకి వచ్చే యువతీ యువకులకు ఇదొక గొప్ప వేదిక అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రియాంక మాట్లాడుతూ.. ఈ చిత్రోత్సవాన్ని నిర్వహించే దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ బృందాన్ని అభినందించారు. ఈ ప్రాజెక్టు ప్రారంభం నుంచి వారు చేసిన అవిశ్రాంతకృషిని ఆమె ప్రశంసించారు. ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైన 60 మంది చిత్ర నిర్మాతలందరికీ ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ అధినేత, అంకురం దర్శకుడు ఉమామహేశ్వర్ రావు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహించి వదిలేయడం కాకుండా, తరువాత కూడా సినిమాలు పంపిన యువతతో, సినిమాలు చూసిన యువతతో ఒక అవగాహన సదస్సు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. తద్వారా సినిమా పట్ల ఆసక్తిగా ఉన్నారనే అంశాలపై అవగాహన పెంచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి డైరెక్టర్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్టెన్ రైజర్ బెలూన్‌ను ఆవిష్కరిస్తున్న క్రాంతి, ప్రియాంక

వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చట్టాలు కావాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ 9వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -కల్చరల్

దేశవ్యాప్తంగా వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ 9వ వార్షికోత్సవ వేడుకల సభ హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం నిర్వహించారు. ఎపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి చంద్ర కుమార్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ మసన చెన్నప్పతో కలిసి గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. వయోవృద్ధుల సహజ కార్యకలాపాలు ఎంతో విలువైనవని, వారికి జ్ఞానం, క్రమశిక్షణతోపాటు అపారమైన జీవిత అనుభవం ఉంటుందని తెలిపారు. సీనియర్ సిటిజన్లు ఎప్పుడూ భారం కాదని, వారి అనుభవం నేటి యువతకు ప్రత్యేకమైన పాఠమని చెప్పారు. వృద్ధాప్యంలో పిల్లలే తల్లిదండ్రులను పోషించాలని 2007లో ప్రత్యేక చట్టాన్ని రూపొందించారని తెలిపారు. నేడు పిల్లలు, వారి తల్లిదండ్రులను చూసుకోలేక వృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధుల హక్కుల గురించి అవగాహన కల్పించడానికి తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ సంఘం చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ప్రొ. కోదండరాం మాట్లాడుతూ.. వైద్యంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల వృద్ధులు 80 సంవత్సరాల వరకు ఆరోగ్యంగా జీవిస్తున్నారని అన్నారు. వృద్ధులకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వయోవృద్ధులకు ప్రత్యేకమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రొ.మసన చెన్నప్ప మాట్లాడుతూ.. వృద్ధుల కోసం సంక్షేమ శాఖను ఏర్పాటు చేసి నిధులను కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వృద్ధులకు సేవా రత్న అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నరసింహారావు, పీఎస్ఎన్ చౌదరి పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న షాహీ గార్మెంట్ కార్మికులు

షాహీ మహిళా కార్మికుల పోరాటం అభినందనీయం

- మహిళా కార్మికుల వేతనాలు పెంచాలి : ఎస్ రమ
- నాలుగో రోజుకు చేరిన నాచారం షాహీ గార్మెంట్ మహిళా కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చలి, భయం, ఒత్తిడిని లెక్కచేయకుండా హక్కుల కోసం ధైర్యంగా పోరాడుతున్న షాహీ మహిళా కార్మికుల సంకల్పం అభినందనీయమని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం పరిశ్రమ ప్రాంతంలోని షాహీ యూనిట్‌లో వేతనాల పెంపు కోసం మహిళలు చేపట్టిన నిరసన గురువారం నాలుగో రోజుకు చేరిన సందర్భంగా ఆమె కార్మికులను కలిసి మద్దతు తెలిపి మాట్లాడారు. తక్కువ వేతనాలతో కుటుంబాలు నెట్టుకొస్తున్న పరిస్థితుల్లో కార్మికులు డిమాండ్ చేస్తున్న కనీస వేతనం రూ.16,000 ఇవ్వడం యాజమాన్యం బాధ్యత అని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా షాహీ యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళలు ఐక్యంగా నిలుస్తున్న వేళ యాజమాన్యం చర్చలకు ముందుకు వచ్చి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుని మహిళా కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐఎఫ్‌టియు నాయకులు అరుణ, ప్రదీప్ మాట్లాడుతూ.. నియమాల ప్రకారం రూ.18 వేల వేతనం ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికీ తొమ్మిది వేలు మాత్రమే చెల్లించడం షాహీ యాజమాన్యం అవలంబిస్తున్న స్పష్టమైన దోపిడీకి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల పోరాటానికి సంఘీభావంగా చర్లపల్లిలోని ఎపి రాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో 800 మంది కార్మికులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్మికుల పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తమ మద్దతు, సహకారం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షకార్యదర్శులు జె చంద్రశేఖర్, ఎర్ర అశోక్, నాయకులు పి సత్యం, పి గణేష్, ఐ రాజశేఖర్, జె వెంకన్న, లింగస్వామి, ఆర్ సంతోష్, మణికంఠ, బివి సత్యనారాయణ, రమేష్, ఎఐటియుసి నాయకులు సత్యప్రసాద్, ధర్మేంద్ర, రమేష్, తదితర కార్మిక సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌పై సిఎంకు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్ ముఖచిత్రాన్ని డాక్యుమెంట్ ఆవిష్కరించిందని వారు పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలను వారి నివాసాల్లో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైన తీరు, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై వారి మధ్య చర్చ కొనసాగింది. సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై అగ్ర నేతలు సిఎంను ప్రశంసించారు. సీఎం వెంట మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపిలు సురేశ్ షెట్కార్, మందాడి అనిల్ కుమార్, పోరిక బలరాం నాయక్, డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ ఉన్నారు.

ఎన్నికల విధులు విస్మరణ

హైదరాబాద్ బ్యూరో : పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడటంలో ప్రిసైడింగ్ ఆఫీసర్(పీవో), ఇతర పోలింగ్ అధికారులు (ఓపీవో) కీలకం. అయితే గ్రామపంచాయతీ తొలి విడుత ఎన్నికల్లో భాగంగా కీలకమైన పోలింగ్ రోజు.. పలువురు అధికారులు తమ విధులకు డుమ్మా కొట్టారు. పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఇది వరకు సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ర్యాండమైజేషన్ చేసి కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారులను, ఇతర పోలింగ్ అధికారులను కేటాయించారు. వీరంతా 10వ తేదీనే కేటాయించిన సదరు సెంటర్‌లకు వెళ్లి రిపోర్ట్ చేయాల్సి ఉంది. కాగా, కామారెడ్డి జిల్లాలో 53 మంది, నారాయణపేట జిల్లాలో 74 మంది.. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజయ్యారు. దాంతో వారికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. వారి స్థానాల్లో ఇతరులను సర్దుబాటు చేసి ఎన్నికలు సజావుగా నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలో మొత్తంగా 53 మంది పీవో/ఓపీవోలు 10వ తేదీన రిపోర్ట్ చేయకపోవడం గమనార్హం.

పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌లో మార్పు చేయాలి

- జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 13 నుంచి ఏప్రిల్ 16 వరకు 35 రోజులపాటు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిందని తెలిపారు. ఇది పూర్తిగా అశాస్త్రీయంగా ఉందని పేర్కొన్నారు. పరీక్షలు సుదీర్ఘకాలం జరపడం వల్ల విద్యార్థుల్లో తీవ్ర ఒత్తిడి, మానసిక అలసట, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. తక్షణమే ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, విద్యా నిపుణుల సలహాలతో శాస్త్రీయమైన పద్ధతిలో కొత్త పరీక్షల షెడ్యూల్‌ను విడుదలచేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల స్థితిగతులపై కనీస అవగాహన లేకుండా, శాస్త్రీయత లేకుండా ఒక్కో పరీక్షకు ఐదు రోజుల చొప్పున సుదీర్ఘ అసమాన గ్యాప్‌లు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ గ్యాప్ వల్ల విద్యార్థుల భవిష్యత్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ షెడ్యూల్‌ను విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నుంచి పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలనే డిమాండ్లు ముందుకు వస్తున్నాయని గుర్తు చేశారు. అందువల్ల పరీక్షల ప్రస్తుత షెడ్యూల్‌ను తక్షణమే రద్దు చేసి, శాస్త్రీయ ప్రమాణాలతో కొత్త షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

డిజిటల్ సేఫ్టీలో రోల్ మోడల్‌గా తెలంగాణ

- విజన్ 2047 డాక్యుమెంట్‌లో సమగ్రంగా రోడ్‌మ్యాప్
- పౌరుల భాగస్వామ్యంతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట
- ఎస్‌సిఎస్‌సి కాంక్లేవ్ 2025లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను డిజిటల్ సేఫ్టీలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగానే "తెలంగాణ రైజింగ్ విజన్ - 2047" డాక్యుమెంట్‌లోనూ సమగ్రంగా రోడ్‌మ్యాప్‌ను పొందుపర్చామన్నారు. గురువారం హెచ్ఐసీసీలో నిర్వహించిన "సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ సీ ఎస్ సీ) కాంక్లేవ్ 2025"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రోజుకో తరహాలో మోసాలకు పాల్పడుతూ సైబర్ నేరగాళ్లు సవాలు విసురుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలో దేశవ్యాప్తంగా 265 మిలియన్లకుపైగా సైబర్ దాడులు జరిగాయని గుర్తు చేశారు. తెలంగాణలోని కీలక రంగాలకు చెందిన సంస్థలు, కంపెనీలపై గతేడాది 17 వేలకు పైగా రాన్సమ్ వేర్ దాడులు జరిగినట్టు ఓ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ అధ్యయనంలో తేలిందని చెప్పారు. ఒక్క సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే ఏడాది వ్యవధిలో రూ.800 కోట్లకు పైగా సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టడం వాస్తవ పరిస్థితికి నిదర్శనమన్నారు. ఇలాంటి తరుణంలో సాంప్రదాయ పోలీసింగ్ కాకుండా స్మార్ట్ పోలీసింగ్ అవసరమని గుర్తు చేశారు. పౌరుల భాగస్వామ్యంతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని వివరించారు. మోసం జరిగిన తర్వాత కాకుండా ముందే స్పందించి సైబర్ నేరగాళ్లను కట్టడి చేసే వ్యవస్థ అవసరమన్నారు. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ డేటా సిస్టమ్స్, రియల్ టైం మానిటరింగ్, ఓపెన్ ఇన్ఫర్మేషన్ లాంటి అధునాతన వ్యవస్థల ద్వారా తమ ప్రభుత్వం పౌరుల డిజిటల్ సేఫ్టీకి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ... వారిని వారియర్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ (హైదరాబాద్) లారా విలియమ్స్, ఎడిజిపి చారుసిన్హా, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఎస్‌సిఎస్‌సి సెక్రెటరీ జనరల్ రమేష్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 19 నుంచి ఎస్‌బిఐ మెగా ప్రాపర్టీ షో

- హైటెక్స్‌లో మూడు రోజులు ఏర్పాటు
- కొనుగోలుదారులకు పలు రాయితీలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మరోమారు మెగా ప్రాపర్టీ షోను ఏర్పాటు చేస్తోంది. నివాస కొనుగోలుదారులకు ప్రాపర్టీలను అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో హైటెక్స్‌లోని నాలుగో నెంబర్ హాల్‌లో డిసెంబర్ 19 నుంచి 21 వరకు దీన్ని నిర్వహిస్తోంది. దీనికి సంబంధించి గురువారం ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ హెడ్ ఆఫీసులో ప్రచార క్యాంపెయిన్‌ను ఆ బ్యాంక్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్ రాధాక్రిష్ణన్, ఇతర అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గృహ రుణాల్లో ఎస్‌బిఐ మార్కెట్ లీడర్‌గా ఉందన్నారు, ఈ ఎక్స్‌పోలో 60కి పైగా డెవలపర్లు తమ వివిధ ప్రాజెక్టులను ప్రదర్శనకు పెడుతున్నారని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఎక్స్‌పోలో నివాసాలను కొనుగోలు చేయడం ద్వారా పలు డిస్కౌంట్లు పొందవచ్చన్నారు. ప్రాసెసింగ్ ఫీజు రద్దు, లీగల్, వాల్యుయేషన్‌కు కూడా ఎలాంటి ఛార్జి వసూలు చేయడం లేదన్నారు. గృహ రుణాలపై వడ్డీ రేట్ల శ్రేణీ 7.7 శాతం నుంచి 8.5 శాతంగా ఉందన్నారు. రుణగ్రహీత పరపతి, ఆస్తి ఆధారంగా వడ్డీ రేట్లను అమలు చేయనున్నామన్నారు. తమ సంస్థ తెలంగాణలో ప్రతీ నెల రూ.2,000 కోట్ల పైగా గృహ రుణాలను జారీ చేస్తోందన్నారు. ఇందులో 60-70 శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తోన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం 2047 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలో ఎస్‌బిఐ కూడా భాగస్వామ్యం అవుతోందన్నారు. మూడు రోజుల పాటు సాగనున్న ఈ ఎక్స్‌పోను కొనుగోలుదారులు ఉపయోగించుకోవాలని రాధాకృష్ణన్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ జనరల్ మేనేజర్లు రవి కుమార్ వర్మ, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణబ్ ముఖర్జీకి ముఖ్యమంత్రి నివాళులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఢిల్లీలోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి.. ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రణబ్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

తమిళనాడు ప్రభుత్వానికి ధన్యవాదాలు

- ఐసిఎస్‌పి రాష్ట్ర కన్వీనర్ ఆండ్రూ జేవియర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమిళనాడులోని డిఎంకె ప్రభుత్వానికి ఇండియన్ క్రిస్టియన్ సెక్యులర్ పార్టీ (ఐసిఎస్‌పి) ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఆండ్రూ జేవియర్ ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత క్రైస్తవులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో అక్కడ అసెంబ్లీ తీర్మానించిందని తెలిపారు. క్రైస్తవులుగా మారిన దళితుల సామాజిక స్థితిలో మార్పు రాలేదని, వారికి న్యాయం చేసే దిశగా స్టాలిన్ సర్కార్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కూడా ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో దక్షిణ ప్రాంత బ్యాండ్ పోటీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో దక్షిణ ప్రాంత బ్యాండ్ పోటీలు గురువారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ కాంపస్‌లోని క్రీడా సముదాయంలో ప్రారంభమయ్యాయి. బ్రాస్ బ్యాండ్ (బాలురు, బాలికలు), పైప్ బ్యాండ్ (బాలురు, బాలికలు) విభాగాల్లో పోటీలు నిర్వహించారు. దక్షిణ ప్రాంత స్థాయిలో విజేతగా నిలిచిన బృందాలు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి బ్యాండ్ పోటీకి సౌత్ జోన్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో పాఠశాల విద్య సంచాలకులు నవీన్ నికోలస్, సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రాధా రెడ్డి, జాయింట్ డైరెక్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. పోటీల నిర్వహణకు కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సహకారాన్ని తీసుకున్నారు.

ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఆండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి మొత్తం తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యార్థి బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ కార్యక్రమం విద్యార్థులలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమన్వయ భావనలను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నిబంధన రద్దు చేయాలి

- టిఆర్‌టిఎఫ్, ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నిబంధన రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్), ఎపిటిఎఫ్ డిమాండ్ చేసింది. గురువారం అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య, టిఆర్‌టిఎఫ్, ఎపిటిఆఫ్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. వేలాది మంది ఉపాధ్యాయుల నినాదాలతో జంతర్ మంతర్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా టిఆర్‌టిఎఫ్ అధ్యక్షులు కటకం రమేశ్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ) ప్రకారం టెట్ నిబంధన అమల్లోకి రాకముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఉందని గుర్తు చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం 2017లో పార్లమెంట్‌లో చట్ట సవరణ చేసి, ఇన్‌సర్వీస్ టీచర్లతో సహా అందరికీ టెట్‌ను తప్పనిసరి చేయడాన్ని తీవ్ర అన్యాయమని విమర్శించారు. 2017లో చేసిన ఈ సవరణను ఉద్దేశిస్తూ, ఇది "ఆట మధ్యలో నిబంధన మార్చడం" లాంటిదని కటకం రమేష్ అభివర్ణించారు. ఈ సవరణతో ఇన్ సర్వీస్ టీచర్లకు ఈ సమస్య మొదలైందని స్పష్టం చేశారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరి చేస్తూ పార్లమెంట్‌లో చేసిన సవరణను తక్షణం రద్దు చేయాలని ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న వేలాది మంది ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే 2017లో చేసిన సవరణను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ప్రేమ, శాంతిని తెలిపే పండుగ క్రిస్మస్

- ఏలూరి శ్రీనివాసరావు
- టిజిఓఎస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమ, శాంతిని తెలిపే పండుగ క్రిస్మస్ అని టిజిఓఎస్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గెజిటెడ్ అధికారుల భవన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యేసుక్రీస్తు జననాన్ని ప్రపంచవ్యాప్తంగా స్మరించుకోవడం క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యత అని చెప్పారు. మానవుల పట్ల ప్రేమతో దేవుడు మనిషిగా అవతరించారని క్రైస్తవులు విశ్వసిస్తారని సంఘం జనరల్ సెక్రెటరీ ఎ సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.శ్యామ్ చెప్పారు. బాప్టిస్ట్ చర్చ్ (వనస్థలిపురం) సంఘ కాపరి వి.మోజెస్ హబ్లూమ్ బైబిల్ సందేశాన్ని వినిపించారు. చార్లెస్ మేదారీ ఆధ్వర్యంలో గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాసరావు క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. శాంతాక్లాజ్ అందరికి బహుమతులు పంచిపెట్టారు.

బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యునిగా ఉదయ్ నాగరాజు ఎన్నిక

- కెటిఆర్ అభినందన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రిటన్ ఎగువ సభ (హౌస్ ఆఫ్ లార్డ్స్) సభ్యుడిగా ప్రవాస భారతీయుడు ఉదయ్ నాగరాజు ఎన్నికయ్యారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కెటిఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా గురువారం స్పందిస్తూ ఉదయ్ నాగరాజు ప్రస్థానాన్ని కొనియాడారు. 'ఇంగ్లాండ్ రాజు చేతుల మీదుగా హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా నామినేట్ అయినందుకు ఆయనకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. యూకేలో పబ్లిక్ ఆఫీస్ కోసం పోటీ చేయడం దగ్గరి నుంచి మొదలుకుని ఇప్పుడు ఈ అరుదైన గౌరవం దక్కించుకోవడం వరకు ఆయన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

గాదరి కిశోర్ భాష మార్చుకో

- నాగరిగారి ప్రీతం వార్నింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ మాట్లాడే భాష మార్చుకోవాలని ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కిశోర్ ఏకవచనంతో విమర్శించడంపట్ల ప్రీతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారంలో ఉండి సహనంగా ఉన్నామని, పార్టీ కండువా, కార్పొరేషన్ పదవి పక్కన పెడితే కిశోర్ తట్టుకోలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగతుర్తిలో కిశోర్ చేసిన అభివృద్ధి చూపిస్తే సగం గుండు, సగం మీసం తీసుకుంటానని సవాల్ చేశారు. పదేళ్లలో బిఆర్ఎస్ రూ.ఏడు లక్షల కోట్ల అప్పు చేస్తే, రెండేళ్లలో రేవంత్ సర్కార్ రూ.ఏడు లక్షల పెట్టుబడులను తీసుకొచ్చిందని తెలిపారు.

ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

- బిసి రిజర్వేషన్లపై మహేశ్ కుమార్ గౌడ్‌తో విహెచ్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ప్రయత్నాలను కొనసాగించాలని పిసిసి మాజీ అధ్యక్షులు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్‌తో భేటీ అయ్యారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిసి సంఘాలతో సమావేశాలు, రౌండ్ టేబుల్ మీటింగ్‌లు, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నాలు తదితర కార్యక్రమాలపై చర్చించారు. బిసి రిజర్వేషన్ల అంశం ముగిసిన అధ్యాయం కాదనీ, ఎలాగైనా సాధించి తీరాలని, అందుకు తగిన విధంగా వ్యూహాలు రూపొందించాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ బిసి నాయకులు ఎఐసిసి అగ్రనేతను కలిసి జాతీయ స్థాయిలో మరింత ఒత్తిడి పెంచేలా పోరాటం చేయాలని వీహెచ్ ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీని రాష్ట్రం నుంచి అఖిల పక్షం ప్రతినిధి బృందం కలిసే విధంగా ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్‌ను వీహెచ్ కోరారు. బిసి రిజర్వేషన్లు విషయంలో ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంకి పాటలతో తెలుగువారికి జానపద గీత విశిష్టత తెలిపిన నండూరి

ప్రజాశక్తి - కల్చరల్

ఎంకి పాటలు తో తెలుగువారికి జానపద గీతాలలో విశిష్టత, సొగసులు తెలిపిన నండూరి సుబ్బారావు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు అని సి బి ఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతి శర్మ పేర్కొన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా నండూరి వెంకట సుబ్బారావు సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా జస్టిస్ నాగ మారుతి శర్మ పాల్గొని మాట్లాడుతూ నాడు తెలుగు నాట కవులు సాహితీ వేత్త లు కేవలం రచనా వ్యాసంగం కె పరిమితం కాలేదు అని చెప్పారు వారు దేశ స్వతంత్రం కోసం పోరాటం లో కూడా పాల్గొన్నారు అని అలాంటి వారిలో గాంధీజీ పిలుపు మేరకు ఉద్యమించిన వారిలో నండూరి కూడా ఒకరు అని గుర్తు చేశారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై కవి రఘుశ్రీ గాయని పేరి అన్నపూర్ణ సంఘ సేవకుడు పి ఎస్ ఆర్ మూర్తి పాల్గొన్నారు

నాక్సియన్ ఎనర్జీ నుంచి ఎనర్జీ స్టోరేజీ ఉత్పత్తులు

- ఏడాదిలోగా రూ.200 కోట్ల పెట్టుబడులు
- ఆ సంస్థ సిఇఒ అభిషేక్ రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దేశంలోనే తొలిసారి సోడియం అయాన్ ఇంధన స్టోరేజీ ఉత్పత్తులను నాక్సియన్ ఎనర్జీ కంపెనీ అందుబాటులోకి తెచ్చింది. గురువారం హైదరాబాద్‌లో వీటిని డిఆర్‌డిఒ మాజీ చైర్మన్ జి సతీష్ రెడ్డి, నాక్సియన్ ఎనర్జీ సిఇఒ అభిషేక్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అభిషేక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ రంగంలో ఇప్పటి వరకు రూ.50 కోట్ల పెట్టుబడులు పెట్టామని.. వచ్చే 2026 డిసెంబర్ నాటికి రూ.200 కోట్ల పెట్టుబడుల వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం వీటిని తమిళనాడులోని కోయంబత్తూరులో తయారు చేస్తోన్నామని.. భవిష్యత్తులో హైదరాబాద్‌లో అసెంబ్లీ, సెల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని యోచిస్తోన్నామన్నారు. 3.5కిలో వాట్, 5కెడబ్ల్యు, 10కెడబ్ల్యు స్టోరేజీ సామర్థ్యాల్లో లభించే వీటిని నివాస, వాణిజ్య అవసరాలకు ఉపయోగించవచ్చన్నారు. భారతదేశపు మొబిలిటీ, పారిశ్రామిక రంగాలకు లీడ్-యాసిడ్ వ్యవస్థలకు పూర్తిగా స్థానిక, సురక్షితమైన, స్కేలబుల్ ప్రత్యామ్నాయాన్ని అందించడంలో మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ సాంకేతికత నివాస, వాణిజ్య, పారిశ్రామిక, రక్షణ రంగాలలో పరిశుభ్రమైన, నమ్మదగిన, నిర్వహణ రహిత ఇంధన నిల్వ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి రూపొందించబడ్డాయన్నారు.

హైదరాబాద్‌లో భారీ చోరీ

- రూ.45 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు రూ. 45 లక్షల నగదు, 15 తులాల బంగారం, నాలుగు తులాల వెండి ఎత్తుకెళ్లారు. వివరాల్లోకెళ్తే.. ప్రొఫెసర్స్ కాలనీలోని మానస అపార్ట్‌మెంట్‌లో 102 నెంబర్ ఫ్లాట్‌లో వెంకటరమణ తన కుటుంబంతో నివసిస్తున్నాడు. అయితే వెంకటరమణ కుటుంబం ఇటీవల టూర్‌కు వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఫ్లాట్ వెనక తలుపు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు రూ. 45 లక్షల నగదు, 15 తులాల బంగారం, 4 తులాల వెండి ఎత్తుకెళ్లారు. వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మలక్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అపార్ట్‌మెంట్‌లో ఐదు నెలలుగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన అర్జున్ దొంగతనం జరిగిన రోజే ఆచూకీ లేకుండా మాయమైపోవడంతో అతనిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. వాచ్‌మెన్లను పనికి పెట్టుకునే సందర్భంలో పూర్తి వివరాలు, బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చూసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

7 బిలియన్ డాలర్లతో క్లౌడ్ డేటా సెంటర్ విస్తరణ

- రాష్ట్ర ప్రభుత్వంతో అమెజాన్ ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ క్లౌడ్ డేటా సెంటర్ మౌలిక సదుపాయలను విస్తరించేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. వ్యూహాత్మక ఫ్రేమ్ వర్క్ ఒప్పందంపై రాష్ట్ర ప్రభుత్వం, అమెజాన్ సంతకాలు చేశాయి. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 నిర్వహణతో తర్వాత, రాబోయే 14 ఏండ్లలో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్టు అమెజాన్ వెల్లడించింది. అమెజాన్ తీసుకున్న నిర్ణయం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఏడబ్ల్యూఎస్ ఇండియా, సౌత్ ఆసియా అధ్యక్షులు సందీప్ దత్తా మాట్లాడుతూ ఈ పెట్టుబడులతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయనీ, స్థానికంగా వ్యాపారం పెరిగి ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్టాట్ నీల్సన్ హైదరాబాద్‌లోని తన సెంటర్ ను ఉత్పత్తుల అభివద్ధికి, డిజిటల్ ఆవిష్కరణలు తదితర వాటికి గ్లోబల్ హబ్ మార్చేందుకు ముందుకొచ్చింది.

బిఆర్ఎస్‌లోకి కొండాపూర్ మాజీ కార్పొరేటర్

- కెటిఆర్ సమక్షంలో సాయిబాబు చేరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ మాజీ కార్పొరేటర్ సాయిబాబా, సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ చౌదరి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు కెటిఆర్ సమక్షంలో గురువారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి కెటిఆర్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పుట్ట విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు బహిష్కరణ

- రెండు తండాల మధ్య విభేదాలు
- అధికారులు సూచించినా ఓటు వేయని ఓటర్లు
- కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గోకుల్ తండా పరిధిలోని..పెద్ద తండా, చిన్న తండా మధ్య ఘర్షణ

ఘర్షణ పడుతున్న రెండు తండాల ప్రజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తండాల మధ్య విభేదాలు.. ఎన్నికల బహిష్కరణకు దారి తీసింది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గోకుల్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని పెద్ద తండా, చిన్న తండా మధ్య ఘర్షణ.. ఎన్నికల బహిష్కరణకు దారితీసింది. పెద్ద తండా పరిధిలో 410, చిన్న తండా పరిధిలో 255 ఓటర్లున్నారు. గిద్ద ఎంపిటిసి పరిధిలో గిద్ద, రాధాయిపల్లితోపాటు గోకుల్‌తండా గ్రామపంచాయతీ ఉంది. గత ఎంపిటిసి ఎన్నికల్లో ఓ అభ్యర్థి చిన్నతండాకు రూ.2.50 లక్షలు ఇచ్చారని పెద్దతండా ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి పెద్దతండాకు ఏకగ్రీవం కోసం రూ.13.40 లక్షలు ఇచ్చినట్టు చిన్నతండా వాసులు ఆరోపిస్తున్నారు. డబ్బుల విషయంలో రెండు తండాల మధ్య విభేదాలు రావడంతో, చిన్న తండా పరిధిలోని 1,2,3 వార్డుల్లో ఒక్కొక్క అభ్యర్థి పోటీచేసేందుకు నామినేషన్ వేసి ఉపసంహరించుకోవడంతో గురువారం ఎన్నికలు జరగలేదు. సర్పంచ్ పదవికి పెద్ద తండా నుంచి ఒకరు, చిన్న తండా నుంచి ఇద్దరు పోటీచేసి చిన్న తండా ప్రజలు ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఎస్పీ రాజేష్‌చంద్ర, ఆర్డీఓ వీణ సందర్శించి చిన్న తండా ఓటర్లకు అవగాహన కల్పించారు. నచ్చిన నాయకుడికి ఓటు వేయాలని, ఎవరూ నచ్చకుంటే నోటాకు అవకాశం ఉందని సూచించారు. అయినా చిన్న తండా ప్రజలు.. పెద్ద తండాకు వెళ్లే ప్రసక్తే లేదని, చిన్న తండాలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తే ఓటు హక్కును వినియోగించుకుంటామని తెగేసి చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. చిన్నతండాలోని ఒకరిద్దరు తప్పా ఎక్కువమంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. అనంతరం ఎస్పీ రామారెడ్డి, ఎఎస్‌పి చైతన్యరెడ్డి.. అన్నారం, రెడ్డిపేట్, రామారెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.